


# గుణాంతరం

– నవులూరి వెంకటేశ్వరరావు

## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## బహుమతి పొందిన ఉత్తమ నవల
## (గత సంచిక తరువాయి)

"మీకు స్వామిని కాగల లక్షణాలున్నాయి. మీ దగ్గిర ఇహపరాల సమాధానాలు దొరుకుతాయి."

"మిమ్మల్ని ఒంటరిగా చూసి, మీ పాదాలను స్పృశించి పోవాలన్నా బలమైన కోర్కెకు నేను లొంగిపోయాను."

స్వామి మాట్లాడలేదు.

"ఎలాంటిదే అయినా కోర్కె నా లాంటి సామాన్యురాలిని వేధిస్తుంది. కోర్కెను లొంగదీసుకోవాలని చూస్తే ఘర్షణ తప్పదు. ఎవరో మీలాంటి పెద్దాయనే అన్నారు కోర్కెను నిర్మూలించాలంటే దానికి లొంగిపోవడమే సరైన మార్గం అని."

"మీరొచ్చినపని అయిపోయింది కనుక నిష్క్రమించండి," అని లోపలి వెళ్ళిపోబోయాడు.

"మీ పాదాలు ముట్టుకుని వెళ్ళిపోతాను," అని గొంతుకూర్చుని పాదాలు తాకింది.

అతని ఒళ్ళు జలదరించింది.

జనసమూహాన్ని చూసి జాలిపడ్డాడు స్వామి. తాను వాళ్ళనుద్ధరిస్తాడని వాళ్ళు నిజంగా నమ్ముతున్నారా, నమ్ముతున్నట్టు నటిస్తున్నారా? తాను దశాబ్దాలపాటు చెప్పినదల్లా విన్నవాళ్ళు కేవలం వినోదంగా తీసుకున్నారని; తన కష్టం వృథా అయిందని జిడ్డు కృష్ణమూర్తి విచారించాడు. వాళ్లకు తాను ఏమి చెప్పినా వాళ్ళు ఆచరించరని, ఆచరించడం కష్టం కూడా కావచ్చని ఈ స్వామికి తెలుసు. చెప్పడం తన వినోదానికి; వినడం వాళ్ళ వినోదానికి.

మరో రోజు మరో ఉపన్యాసం అందుకున్నాడు.

ధర్మం, అధర్మం చక్కెర్లకొడుతూ మేమంటే ఇది అని చెప్పుకోవు. దేవుళ్ళు, గంధర్వులు, పూర్వీకులు ధర్మాధర్మాలు ఏవో ప్రకటించారు అని ఆపస్తంబుడు అంటాడు.

ధర్మపథం ఏది అని యక్షుడు ప్రశ్నించినపుడు ధర్మరాజు వేదాలలో ప్రబోధించినదానికి, అనేక ఋషుల ప్రబోధానికి పరస్పర వైరుధ్యం ఉన్నది అన్నాడు.

అంతేగాక జ్ఞానుల ధర్మ ప్రవచనాన్ని అర్థం చేసుకోడం కష్టం. నియమానుసారం ప్రవర్తించే మంచి వ్యక్తులు ఏ వ్యక్తిగత లక్ష్యాన్ని గానీ, లాభాపేక్షనుగానీ కలిగి ఉండక, అలా తేటతెల్లంగా కనిపిస్తూ, నిర్ణయించేదాన్ని ధర్మంగా భావించవచ్చు అని కుమారిలభట్టు – ఆపస్తంబుడితో ఏకీభవిస్తున్నట్టు అన్నాడు.

ఏదైతే ఘర్షణకు దారి తీస్తుందో అది అధర్మం; ఏదైతే ఘర్షణకు ముగింపు పలికి ఏకత్వానికి దారితీస్తుందో అది ధర్మం అన్నాడు భీష్ముడు. మరో ప్రశ్నకు సమాధానంగా ఎవరినీ హింసించకపోవడం అత్యంత ఉత్తమమైన ధర్మంగా పేర్కొన్నాడు.

ధర్మానికి అనేక రూపాలున్నాయి: నిజాయతీగా ప్రవర్తించడం, తనదైన విధులు నిర్వర్తించడం, కర్మ కాండ నిర్వర్తించడం, కులధర్మాన్ని పాటించడం, కుటుంబ ధర్మాలను పాటించడం. కాలాన్నిబట్టి, యుగాన్నిబట్టీ ధర్మం మారుతుంటుంది. ఒకనాటి ధర్మం నేడు అధర్మం అవుతుంది. సత్యవతి శాంతనులకు పుట్టిన ఇద్దరు కొడుకులలో చిత్రాంగధుడు యుద్ధంలోపోగా, చిత్రవిచిత్రుడు అనారోగ్య కారణంగా మరణించాడు. వాళ్ళిద్దరికీ సంతు కలగలేదు. వంశం అంతరించే ప్రమాదం ఏర్పడింది. భీష్ముడు తన 'తల్లి' సత్యవతికి ధర్మం బోధిస్తాడు. దాని ప్రకారం విధవరాళ్ళైనా అంబికా, అంబాలికలకు మరొక పురుషుడితో సంతానం కలిగే ఏర్పాటు చేయవచ్చంటాడు. వ్యాసుడూ దాన్ని ధర్మ విరుద్ధంగా భావించక ఇరువురి మరదళ్ళకూ సంతానాన్ని ప్రసాదిస్తాడు. మన కాలంలో దాన్ని మనం ధర్మంగా అంగీకరించం. భారతమంతా కృష్ణద్వైపాయనుడి ధర్మ శోధనగా భావించవచ్చు. ధర్మం గురించీ అనేక సందర్భాలలో సంశయాలు వస్తుంటాయి. వాటిని తీర్చే ప్రయత్నాలూ జరుగుతుంటాయి. కురువంశం అంతరించి పోకుండా విచిత్రవీరుడి మరణానంతరం విధవలుగా మిగిలిపోయిన అతని భార్యలు అంబికా అంబాలికలతో వ్యాసుడు కలిసి గర్భాదానాలు చేస్తాడు. ఆ సందర్భాలు స్త్రీ దృష్టితో చూసినపుడు భయంకర అనుభవాలే – ధర్మాధర్మాల ప్రసక్తి పక్కనుంచీ. అతన శరీరం దుర్గంధభూయిష్టమని, తాను నల్లగా ఉంటాడని, గెడ్డం మీసాలతో స్త్రీకి లైంగికానుభవానికి అతనితో కలవడానికి జుగుప్స కలుగుతుంది కానీ శృంగారభావన కలగదని ఆయనకు తెలియదని మనం భావించరాదు. పెద్దామె అంబికకు వ్యాసుడితో తాను కలవాలన్న విషయం తెలియదు. భీష్ముడొస్తాడో, మరో కురువీరుడో వస్తాడని ఎదురు చూస్తుంది, అత్త సత్యవతి అర్ధసత్యానికి పాల్పడటం వలన. శృంగార సమయంలో ఒక్క క్షణమూ కనురెప్ప ఎత్తదు అంబిక. ఫలితం ఒక విషాదం; ధృతరాష్ట్రుడు పుట్టాడు. పోనీ అంబాలికకు సరైన శృంగారానుభవం కలిగిందా? భయంతో పాలిపోయి దరిమిలా పాండురోగిని కనింది. ధర్మం ఊపిరిగా మెలిగిన వ్యాసుడి నడవడి ధర్మానికి అనుగుణంగా ఉందా అన్న ప్రశ్న మనలను వేధిస్తుంది. భీష్ముడేమన్నా ధర్మచరితుఁడా? తన స్వార్థ సత్యవాక్కు పాలనకు గాను మరదళ్ళతో కలవడానికి ఒప్పుకోడు. గాంధారిని ఇవ్వమని అడిగితే, గాంధారరాజుకి అంధుడికి పిల్లను ఇవ్వను అని అనగల ధైర్యం

ఉందా? సైన్యాలతో వెళ్లి మాద్రి తండ్రినడిగితే తన అందమైన పుత్రిని పాండురోగికి ఇవ్వననగల సత్తా ఉందా? కాశీరాజు మీదికి దండెత్తి ముగ్గురు కన్యలను తేవడంలో ఏ ధర్మం ఉంది ఎంత  సమర్ధించుకున్నా? ధర్మం గురించీ ధర్మరాజు పదేపదే భీష్ముడిని అడిగి తెలుసుకుంటుంటాడు.

ఇంతకూ ధార్మిక నియమాలు కొన్నిఎలా ఏర్పడ్డాయో చదివితే బాధ కలగక మానదు. ఉపనిషత్తులలో ప్రసిద్ధుడైన శ్వేతకేతు  తల్లిని మరొకడొచ్చి తల్లీ కొడుకుల సమక్షంలోనే 'పోదాంపద' అంటాడు, ఆమె వారిస్తుంది. తండ్రి అప్పుడున్న ధర్మం ప్రకారం స్త్రీ ఎవరితోనైనా లైంగిక అనుభవం ఏర్పరచుకునే స్వేచ్ఛ ఉందంటాడు. కొడుకు క్రుద్ధుడై ఒక స్త్రీకి ఒకే పురుషుడు అన్న ధర్మాన్ని తిరిగి వ్రాస్తాడు. ఆ ధర్మం ఏమైనా అందరికీ ఆమోదయోగ్యం అయిందా? లేదు.

పాండురాజు కుంతీదేవిని మరొకరితో కలిసి సంతానాన్ని కనమంటాడు; అది ధర్మమే అని కథ చెబుతాడు. కంటుంది.

ఉతథ్య భార్య మమతను అతని తమ్ముడు బృహస్పతి లైంగిక కార్యానికి బలవంతం చేస్తాడు గర్భవతిని అని చెబుతున్నా. లోపలి పిండం ఇక్కడ నాకు మాత్రమే చోటుంది మరో జీవికిలేదు, ఆ పనికి పూనుకోవద్దని ప్రాధేయపడతాడు. వాడు వినడు. వీర్యాన్ని లోపలి రాకుండా శిశువు అడ్డుతాడు; గుడ్డివానిగా శాపగ్రస్తుడవుతాడు. అతనిపేరు దీర్ఘతమస్సుడు. అవన్నీ కలియుగంలో జరగడానికి మాత్రమే అనుగుణమైనవి అని భావించాలేమో!

ధర్మం భంగపడినపుడు దాన్ని అధర్మంతో ఎదుర్కొనడం ధర్మమే అని మనం భావించవలసి వచ్చే వృత్తాన్తమ్ మనకు భారతంలో దొరుకుతుంది.  అటు శక్తులు అటు, ఇటు శక్తులు ఇటు వీరోచితంగా ఊచకోత కోసుకుంటున్నాయి. భూరిశ్రవుడు అనే మహావీరుడు సాత్యకిని క్రిందపడేసి గుండె మీద కాలుపెట్టి ఒక చేత్తో కత్తి పట్టుకుని మెడ తెగవేయబోతున్నాడు. కృష్ణార్జునుల బంధువు సాత్యకి. అర్జునుడిని అతనివైపు పురికొల్పాడు కృష్ణుడు ధర్మవిరుద్ధంగా. ఒక వీరుడు మరొక వీరుడితో పోరుసలిపేటప్పుడు మూడోవాడు కలుగచేసుకోకూడదు. అర్జునుడి బాణంతో భూరిశ్రవుడి కత్తి ఉన్న చేతిని నరికేశాడు. అతను అర్జునుడిని నిందించాడు ధర్మ విరుద్ధంగా ప్రవర్తించినందుకు. అది ధర్మమే అని పేర్కొంటూ అభిమన్యుడిని ఆరుగురు కలిసి ఆ విధంగా చంపలేదా అని అర్జునుడు అడిగాడు. తన దేహాన్ని విడుచుటకొరకు ఆయుధాలు విసర్జించి ధ్యానంలో ఉన్న భూరిశ్రవుడి తల నరుకుతాడు సాత్యకి తేరుకుని కత్తితో. అదీ అధర్మమే. అధర్మపుపనిని అధర్మపు పనితో ఎదుర్కొనడం ధర్మమే అని మనం ఆ వృత్తాంతం వలన గ్రహించాలి.

జయద్రథుడిని సూర్యుడు అస్తమించేలోపు చంపకపోతే అర్జునుడు ఆత్మహత్యకు పాల్పడాలి. జయద్రథుడి జీవన్మరణ సమయ అర్జునుడి జీవన్మరణ సమస్య. మోసంతో కృష్ణుడు సూర్యాస్తమయం అన్న భ్రమను కలిగించాడు. జయద్రథుడి తల తెగింది. సాయంకాల ధ్యానానికి  సమాయత్తమవుతున్న ముసలి తండ్రి ఒడిలో ఆ తెగిన తలను పడేట్లు చేశారు. ఆయన చచ్చాడు. ఇందులో ఏ ధర్మం లేదు; పరమ క్రూరత్వం ఉంది. చివరకు మనకు ఏమనిపిస్తుంది? అవకాశవాదమే ధర్మం అనిపిస్తుంది.

ఆహారపుటలవాట్లు ధర్మంలో భాగమే. కరువొచ్చింది. విశ్వామిత్రుడి లాంటి బ్రహ్మ లేక రాజరుషికే తిండి కరవైంది. కుక్కమాంసం దొరికింది. తినకూడదని అన్నాడు ఒక చండాలుడు. ధర్మ విరుద్ధం కాదని విశ్వామిత్రుడన్నాడు. ఆపద్ధర్మం అన్నమాట మనం విన్నాము. ఆ మాంసాన్ని పితరులకు, దేవతలకూ కూడా పంచినట్టు చూపి తానూ తిని ప్రాణం నిలబెట్టుకున్నాడు.

ధర్మం లోపించినపుడు సంభవామి యుగే యుగే అన్నాడు కృష్ణుడు. ధర్మం ఏదో, అధర్మం ఏదో నిర్వచించలేక పోయినపుడు ఏ వ్యవస్థయినా దేన్నిపాటించాలి అన్న ప్రశ్న సహజంగా ఉదయిస్తుంది. కృష్ణుడి ఉద్దేశంలో ఒక్కొక కులానికి నిర్దేశించినవి ధర్మాలు. ధర్మ సందేహం ధర్మాన్ని నిర్దేశించేవాళ్లకే వస్తే, ఏ ధర్మాన్ని పాటించాలి అని సామాన్యులు అయోమయానికి గురికావలసి ఉంటుంది కదా.

పాండవులు అక్రమ సంతానం కనుక రాజ్యాధికారం లేదు అని దుర్యోధనుడు వాదించినపుడు భీష్ముడు అయోమయంలో పడ్డాడు. వ్యాసుడి దగ్గిరికి వెళ్ళాడు. వ్యాసుడు తన పుత్రుడైన శుకదేవుడి మరణంతో వైరాగ్య మనస్కుడై వున్నాడు. మరణం ఎప్పటికైనా తథ్యం. దాని గురించీ ఎదురుచూడడం ఎందుకని భావించిన శుకదేవుడు అన్నపానాలు నెలరోజులపాటు మాని మృత్యువువడిలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. వ్యాసుడికి భీష్ముడు తన ధర్మ సందేహాన్ని వినిపించాడు. వ్యాసుడన్నాడు, "అయ్యో నేను చెప్పలేను అవి. జీవితార్థం ఏమిటో కూడా నాకు తెలియదు."

భగవంతుడిగా మనం కొలిచే కృష్ణుడు లేక రాముడికి ధర్మాన్ని నేల రాసెయ్యక తప్పని పరిస్థితులు ఏర్పడినపుడు, ధర్మాన్ని చరచటం తప్ప మనలాంటి సామాన్యులకు దాని అనుసారం చరించడం వీలవదు కదా. వాలి వధ, సీతను కారడవిపాలు చేయుట, తాటకివధ, శూర్పణఖ ముక్కూచెవులూ కోయడం లాంటి కార్యాలు ధర్మబద్ధమైనవే అయుంటే, నేటికీ అవి ధర్మబద్ధమైనవా కావా అన్న మీమాంస కొనసాగుతుండేది కాదు. ధర్మాన్ని రక్షించవలసిన భగవంతుడిగా కొలువబడే శక్తులే ధర్మాన్ని రక్షించలేకపోయినపుడు మీరూ, నేనూ తెల్లమొహాలు వేయడమేగా చేయాలి?

ధర్మానికి దానిదంటూ దానికి స్వాభావిక (intrinsic) విలువ లేక మంచి ఉంటాయట. అలాంటి విలువ డబ్బుకూ ఉంటుంది. అది ఖర్చుపెట్టినపుడు వస్తువులనో, సేవలనో పొందనూ వచ్చు అని కొందరు ఉదహరిస్తారు. బాహ్యమైన (extrinsic) విలువకు అన్ని వేళలా ఆ వెసులుబాటు ఉండదు. పనికి మాలిన బ్రాస్లెట్ కానుకగా పొందినపుడు దానికి విలువ ఉండదు, అది ఏ మంచి లేక మేలుకూ ఉపయోగపడదు. ఒక వ్యక్తి సంతోషంగా ఉన్నాడనుకోండి అలా వాడు ఉండటం మంచిదే, అతని ఆనందం ద్వారా ఇతరులకు ప్రయోజనం కలగడమూ మంచిదే. ధర్మం విషయంలో రెండు రకాల సిద్ధాంతకారులున్నారు. పర్యావసానత్వ వాదులు (consequentialists), విధినిర్వహణా, నైతిక వాదులు (deontologists). మొదటి వాళ్ళు – ఏదైతే మంచికి దారితీస్తుందో లేక మంచి ఫలితాలను ఇస్తుందో అది ధర్మం అంటారు; నీతి అంటే తన విధికి కట్టుబడి ఉండటం అంటారు. రెండో రకం వాళ్ళు – విధికి (duty) భంగం వాటిల్లే ఏ క్రియ, దాని పర్యావసానంగా మంచి జరిగినా, తప్పిదం అవుతుంది. రాముడు, కృష్ణుడు

చేసిన వివాదాస్పదమైన పనులను పర్యావసానత్వం దృష్టితో చూసినపుడు సరైనవవుతాయి. డియోన్తోలోజి ప్రకారం అవి తప్పుదువి.

కర్ణపర్వంలో ధర్మం సకల జీవుల సంక్షేమం గురించీ సృష్టించబడినట్టు చెప్పారు. అది ఏ విధంగానూ సృష్టించబడిన జీవికి అపకారం చేయరాదు అని ప్రకటితం అయింది అచ్చోట.

ధర్మ కామ పురుషార్థాలలో – ధర్మం, అర్థం, కామం, మోక్షం ఒకటే ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకున్నవి – మనిషికి ఉపయోగపడటం.

ఒక్కసారి వెనక్కువెళ్ళి వ్యాసుడు చేసిన పనిని పర్యావసానత్వ తూకం రాళ్లతో తూకం వేద్దాము. ఆయన చేసినది ధర్మ విరుద్ధమా, ధార్మికమేనా అన్న విషయాన్ని పక్కనుంచి, ఆ అమాయక, దురదృష్టవంతురాళ్లిద్దరికీ లైంగిక సుఖమూ దొరకలేదు, ఆరోగ్యవంతులైన సంతానము దక్కలేదు. అలాంటి లోపాలతో సంతానాన్ని పొందటంకన్నా, నిస్సంతుగా ఉండటం మేలు కదా. ఆ సంతానానికి పుట్టిన సంతానాలా చర్యల ద్వారా ఒక మహా సంగ్రామం జరిగి ఇంచుమించు ఒక జాతి ధ్వంసం అయింది. ఆ సంతానం వ్యాసుడి సంతానమే కూడా. వాళ్ళతో పాటూ కోట్లాది ఇతరులూ నశించారు. వ్యాసుడు త్రికాలజ్ఞుడు – గత, వర్తమాన, భవిష్యత్ కాలాలలోని విషయాలను ఎరుగ గలిగినవాడు. అయినా ఆ కార్యానికి ఎందుకు పాల్పడ్డాడు. విషయాలు మూడు కాలాలవీ తెలియడం వేరు, వాటిని నిరోధించగలగడం వేరు. అంటే ఆయన నిమిత్తమాత్రుడు అనుకోవాలి. తప్పు చేశాము, చేస్తున్నాం, చేస్తాము అన్న అపరాధభావాల నుంచీ మనిషికి ఒక ఊరటగా ఉపయోగపడుతుందేమో నిమిత్తమాత్రుడిని అనుకుంటే.

అనుశాసనాపర్వంలోని భీష్ముడి మాటలు సందర్భోచితం. యుద్ధం ముగిసింది. సర్వత్రా నాశనం జరిగింది. ధర్మరాజు మనకు విచారంతో నిండిపోయింది. తాతను అడిగాడు – 'ఈ పాపాన్ని ఎలా కడిగేసుకోవాలి చెప్పు.' ఆయనన్నాడుగదా – 'దేముడు, విధి, కాలాల మీద ఆధారపడి ఉన్న నీ ఆత్మ నీ కార్యాలకు బాధ్యత ఎలా వహిస్తుందని భావిస్తావు? ఒక వృత్తాంతాన్ని చెబుతాను. గౌతమి అన్న వృద్ధురాలి కొడుకు, ఒక పసివాడు, పాముకాటుకు మరణించాడు. వేటగాడు పామును చంపుతానంటాడు. ఆమె ఒద్దంటుంది. వాడు చనిపోవాలని ముందే విధి నిర్ణయించింది. పాము కేవలం ఒక నిమిత్తమని, క్షమా జాలి దాని పట్ల చూపించాలని అంటుంది. అంతే గాక నిజానికి ఇలాంటి కష్టాలు ధర్మజీవనం మీద మనస్సు నిలిపిన వాళ్లకు రావు అంటుంది.' భీష్ముడి మాటలు, చెప్పిన వృత్తాన్తము ధర్మరాజును నిజంగా సంతృప్తిపరిచే ఉంటాయని కానీ, శాంతిని ఇచ్చి ఉంటాయని కానీ మనకు అనిపించదు.

నాకు మాత్రం మనం ఏ తప్పునైనా దేముడు, కాలం, విధి మీద నెట్టివేయడం తప్పు కాదు అనిపిస్తోంది. ధర్మాన్ని ఆచరించడంగాని, అధర్మానికి పూనుకోడంగాని మన చేతుల్లో లేని పనులేమో అనుకుంటాను. సంకల్పమాత్రంగా ఆ రెండిటిలో దేనికీ క్రియారూపం ఇవ్వలేము.

గౌతముడు అనే ముని సత్యం పలికి బాటసారుల మరణానికి కారణమయిన కథలో దియోన్తోలోజి ఓడిపోయింది. సత్యం పలకడం అనే ధర్మం అతని విషయంలోనూ విలువలేనిదయింది, జీవహింసకు దారితీసింది.

గీతలో అర్జునుడు కృష్ణుడిని అడిగాడు: మనిషికి ఇష్టం లేకున్నా బలవంతం చేయబడినట్లు ఎవరిచేత ప్రేరేపితుడయి పాపాలను చేస్తాడా? కామం ప్రేరేపిస్తుంది అని కృష్ణుడు అన్నాడు. ఇది రజోగుణం మంచీ ఉత్పన్నమవుతుంది. భోగానుభవంతో కామం చల్లారదు. ఆరనిఅగ్ని. జ్ఞానాన్ని అది కప్పివేస్తుంది. బుద్ధి ద్వారా మనసును వశపరచుకుని కామాన్ని నిర్మూలించాలి. అధర్మవర్తనకు పాల్పడేవాళ్ళకు పాపం కలుగుతుంది.

ఇక్కడ ఒక చిక్కులేదుకదా? నాలుగు పురుషార్థాలలో కామం ఒకటి. పురుషార్థం అంటే జీవిత లక్ష్యం. మిగతా లక్ష్యాలు ధర్మం, అర్థం, మోక్షం. కామాన్ని వాత్సాయనుడు నిర్వచించాడు: ఇంద్రియాలు అపేక్షించే వాటిని ఆత్మ సహకారంతో అనుభవిస్తూ ఆనందించడం; వినికిడి, స్పర్శ, దృష్టి, రుచి, వాసనలను ఆయా ఇంద్రియాలు అనుభవించడం; ఇందులోని చిత్రం ఆయా వస్తువుల ఇంద్రియాల సంధానం తద్వారాకలిగే సుఖానుభూతి కామం.

కామానికి, కర్మకు సంబంధం వుంది. సుఖం మన అస్తిత్వానికి ఆహారమంత అవసరమట. సుఖాన్వేషణలో జాగ్రత్త తీసుకోవాలి అంటాడు వాత్సాయనుడు. సుఖాలను వద్దనుకునే వాళ్లకు ఆయన చెప్పేదేమిటంటే – అడుక్కునేవాళ్ళ బాధుండదు కదా అని ఒండుకోటం మానం; లేళ్ళొచ్చి ధ్వంసంచేస్తాయని పంటకై విత్తనాలు నాటటం మానం.

ఆ రోజు ఉపన్యాసం ఐన తరువాత కాపలాదారుల నుండీ ఎలా తప్పుకుందో ఆ మధ్య వచ్చిన స్త్రీ మళ్ళీ స్వామి దర్శనానికి వచ్చి మొండిపట్టుపట్టింది. సదాజపుడు పరిపరివిధాల చెప్పిచూశాడు. ఆమె విశ్వామిత్రుడిని చెరిచిన మేనకలా తోచింది. అతను వెళ్లి స్వామికి నివేదించాడు.

"కుదరదని చెప్పు, సదాజపా. వేలాదిమంది వచ్చి నన్ను కలుస్తానంటే నేను వాళ్లందరినీ కలియలేను కదా?"

సదాజపుడు ఆమెను చాలా కఠినంగా వెళ్లిపొమ్మని చెప్పాడు. వెళ్ళిపోయింది ఏడుస్తూ. ఆ తరువాత స్వామి అడిగినపుడు ఆమె ఏడుస్తూ వెళ్లిపోయిన విషయం మనవిచేసుకున్నాడు.

స్వామివారి మూడో ఉపన్యాసం:

కామం గురించి గతంలో కొద్దిగా మాత్రమే నేను ప్రస్తావించాను. అది మీకు ఎపెటైజెర్ అయుంటుంది. మరికొంత ఆలకించాలని ఉబలాటపడి ఉంటారు. దుఃఖం కలగాలని ఏ చవలయీ కోరుకోదు, కోరుకోడు దుఃఖంలో సుఖం లేదుగనుక; సుఖం గురించీ అర్రులుచాస్తాడు. చాలా ఆసక్తికరమైన విషయం కామం. అవునా? కామానికి వేయి తలలలాంటి కోర్కెలు. కోర్కె మన యజమాని. యజమాని శాసిస్తాడు. కోర్కె తీరితే సుఖం; తీరకపోతే నరకం. సుఖం లౌకిక జీవితార్థం. వైరాగ్యంలోని సుఖం గురించి విరాగులు ఉవ్విళ్ళూరుతారు. లైంగిక సంబంధమైన కామం గురించీ మీకు పెద్దగా చెప్పక్కరలేదు; మీరే నాకు బాగా చెప్పగలరు (నవ్వులు).

“ఈ మృత్యు ప్రపంచంలో బ్రహ్మజ్ఞాన సుఖంతో పోల్చదగినది లేదన్నది సత్యం. ఒక అందమైన స్త్రీని పొందిన సంతృప్తి సుఖం బ్రహ్మానందానికి ద్వితీయమైనదియు, దిగువదియు," అని అంగరంగ అన్న కామశాస్త్రంలో కళ్యాణ మల్లుడు కామానుభవానికి ఆకాశమంత పీట వేశాడు.

కోర్కెల నుంచి ఎలా విముక్తిచెందటమా అని అతి కొద్దిమంది, వాటిని సిద్ధింపచేసుకోడం ఎలా అని అతి ఎక్కువమంది సతమతమవుతుంటారు. ఆ రెండు రకాల వారూ నా సహాయాన్ని అర్థిస్తున్నారు; వేధిస్తున్నారు. కోర్కెలను ఎలా జయించాలి అని చూసేవారు నాకు ఆప్తులు. అలాని మిగతావాళ్ళు నాకు శత్రువులూ కాదు. శత్రుత్వం, ఆప్తత్వం మాత్రమే కాదు మనుషుల మధ్య ఉండే సంబంధాలు. ఉక్కిరిబిక్కిరి చేసే కోర్కెలను తీర్చుకోడానికి పొగరుమోతు గుర్రముమీద స్వారీ చేసి తీర్చుకోచూస్తే పళ్ళు రాలే ప్రమాదముంది, ఎముకలు, విరిగే ప్రమాదమూ ఉంటుంది. రోగగ్రస్తమూ అవవచ్చు. పరువు పోవచ్చు. విచ్చలవిడితనం సమాజానికి చేటు చేస్తుంది. సమాజంతో నాకేంటి అని దాన్ని ధిక్కరించదలచినవాళ్లు కారడవులకు వెళ్లి జంతుజాలంతో కాపురం చేసుకోడం మంచిది.

డియోజినీజ్ అనే సినిక్ గురించీ వినే ఉంటారు. అతను రెండువేల ఏళ్ళ క్రితం మరణించివుండకపోతే నాతో పూర్తిగా ఏకీభవించి ఉండేవాడు. కాలం అందర్నీ కబళిస్తుంటుంది. కబళించడం దాని స్వభావం. అలాంటి స్వభావాన్ని అది కలిగి ఉండటం మనందరికీ శ్రేయస్కరం కూడా. మానవ చరిత్రంతా తత్త్వాల, తాత్త్వికుల మయం. ఒకరితో ఒకరు ఒకదానితో మరొకటి ఏకీభవించివుంటే అన్నిటికి, అంతమందికి చరిత్రలో స్థానం ఉండేది కాదు.

నేను చెప్పినాయన తనకు కుక్క గురువు అంటాడు ఉన్న మానవ గురువులు చాలరు అన్నట్టు. మన సిద్ధాంతాన్ని కుక్కకు అన్వయిస్తే, కుక్కే గురువు, కుక్కే దేవుడవుతుంది. ప్రతి జీవిలోను దేవుడుంటాడు కదా. ఇది నిజం అన్న భావన మనిషికి ఉండుంటే వాడు ఇప్పుడున్నంత ఘాతుకంగా ఉండేవాడు కాదు. ఆ తాత్త్వికుడి ఉద్దేశంలో దానిలా తక్కువ కోర్కెలతో వీలైనంత సాధారణ జీవితం గడపాలి, అదే మనిషికి సంతృప్తినీ, ఆనందాన్నీ ఇస్తుంది; మనిషి హిపోక్రిసీ అంటే ద్వంద్వనీతిని ఒదిలిపెట్టాలనీ అన్నాడు. ఆ తత్త్వాన్ని, మేమందరం మా తత్త్వాలను బోధించి ఆచరించకుండా ఒదిలేసినట్టే తానూ బోధనకు అతను పరిమితం చేసుంటే బాగుండు. అనుయాయులు ఆచరిస్తే ఆచరిస్తారు లేకపోతె పోతారు. తాను వెర్రిగా ఆచరించి చూపాడు. ఒక మనిషి మాత్రమే పట్టే గొట్టంలో నివసించాడు. అతని ఆస్తిపాస్తులు ఒక లాంతరు, ఒక చిప్ప. ఒక కుర్రాడు దోసిళ్ళతో నీరు తాగడం చూసి తానూ అలాగే చేయ వీలుంది కనుక చిప్పమాత్రం ఎందుకని పగలకొట్టాడు. అసలు – ఏథెన్సులో అందరూ డియోజినీజ్ లయితే అతనికి బిచ్చం వేసేవాళ్ళుండరు. అంటే జనాభాలో సగం మంది కుక్కల్లాంటి మనుషులు, సగం మంది మనుజులలాంటి మనుజులూ ఉండాలేమో – పుట్టు కుక్కలతో పాటు. ఆయనతో నేను ఏవిధంగా విభేదిస్తున్నాను అంటే మనిషి కుక్కలనూ, కుక్క మనిషిలాగానూ జీవించాలని ప్రకృతి భావించకపోబట్టే కుక్కను కుక్కలాగానూ, మనిషిని మనిషిలాగానూ పుట్టిస్తోంది. ఇంతవరకు కుక్కకు రెండే కోర్కెలు. తినడం, మరో కుక్కతో సంగమించడం. మనకు అలా కాదుకదా. కుక్కనుంచీ మనిషి కోర్కెల సంఖ్య విషయంలో వేరు

చేయబడినాడు. కుక్కలా మనిషి జీవించడం ఎలా ప్రకృతి విరుద్ధమో, మనిషిలా కుక్క జీవించడమూ అసంభవం. 'అల్ప బుద్ధివానికి... కనకపు సింహాసనమున' పద్యాలలో కుక్కను చీదరభావంతో చూశారుకాని మనిషికి వేసే పీట దానికి వెయ్యలేదు. కుక్కలా మనిషి జీవించాలని మనిషి భావించినా డియోజినీజ్ (ఈయనను పిచ్చి సోక్రటీసు గా అభివర్ణించాడు ప్లేటో), కుక్క చెయ్యని ఒక పనిని కూడా కుక్కలా బహిరంగంగా చేశాడు. అదే హస్తప్రయోగం. అదీ నగరకూడలిలో, పగలు, అందరూ చూస్తుండగా చెయ్యడం. ఆ పని పేరు చెప్పంగానే చాలామంది భక్తులు తలలు వాల్చారు, చూపులు మరల్చారు. ఇలాంటి హిపోక్రసీని, కాపట్యాన్నే డియోజినీజ్ కన్నా నేను గర్హిస్తాను. మనం దొంగతనాలు, రంకుతనాలూ చేస్తాం కానీ అవిచేసే ఇతరులను పిలిచే భాషాజాలంతో మనలను పిలిస్తే పళ్ళుకొరుకుతాం. హస్తప్రయోగం చేసుకోడానికి సిగ్గుపడరుకని బహిరంగంగా దాని పేరెత్తితే దానిపేరు వినడమే మహాపాపం అన్నట్టు తలలు దిన్చేస్తారు. మాంసం ఆరగించి పేగులను మెడకు వ్రేలాడేసుకోము కదా అని మీలో ఎవరన్నా నన్ను ప్రశ్నించే ప్రమాదమూ కలదు.

డియోజినీజ్ ఇతరులలా గదుల్లో లేక నాలుగు గోడల మధ్య ఆ పని చేసుకునే వెసులుబాటు లేదు, బహిరంగంగా కాక. సానుభూతితో మనం అర్థం చేసుకోవాలి. సిగ్గూ శరమూ పుష్కలంగా ఉన్నాయని తనకు తాను భావించే మనిషి బహిరంగంగా మూత్ర, మల విసర్జన చేయడం మనకు తెలియంది కాదు. అలా ఒక్కసారన్నా చెయ్యని మనిషి మనలో ఒక్కడూ ఉండడు. హస్తప్రయోగానికి మాత్రం నియమం ఉండాలా? తన శరీరంతో తాను తంటాలుపడ్డాడేకాని మరొకరి శరీరం జోలికి అతను పోయే ప్రయత్నం చేయకపోవడంలోని గొప్పదనాన్ని మనం గ్రహించక తప్పదు. తప్పులు అనేకం చేస్తుంటాం, అలాచేయడంలో కలిగే ఆనందం కారణంగా కావచ్చు, చేయక తప్పకపోవడం వలన కావచ్చు లేక పొరబాటువల్ల కావచ్చు. తప్పు చేసి మనలను మనం సమర్థించుకుంటుంటాం, మనలను ఇతరులు సమర్థించే అవకాశం లేకపోవడం వలన. ఆ తత్త్వవేత్త ఆ పని చేసి తనను తాను ఎలా సమర్థించుకున్నాడో చూడండీ: "శరీర రాపిడి ద్వారా లైంగిక వాంఛ తీరినట్లే, కడుపు మీద రాసుకోడం వలన ఆకలి తీరేట్లయితే ఎంతబాగుండు!" – కేవలం ఇతరులకు ఆ విషయాన్ని బోధించుటకు హస్తప్రయోగం చేసుకున్నట్టు అన్నాడు. అందుకే వాళ్ళను గొప్ప తత్త్వవేత్త లన్నారు. ఎంతకాలమైనా వాళ్ళను మరువలేకుండా వున్నాము. నాలాంటి తత్త్వవేత్తలు పుట్టారా గిట్టరా చెదపురుగుల్లా. ఇంతకూ కోర్కెలలు లేకుండా జీవించాలన్న సదుద్దేశంతో కుక్కలా జీవించిన ఆ మహనీయుడు హస్తప్రయోగానికి ఎందుకు పాల్పడినట్టు? కోర్కెను తీర్చుకోడమే కదా. మనలాంటి అతి సామాన్యమైన వ్యక్తులు చేసుకునే ఆ పని! కోర్కెతో వేగలేకేకదా? మహనీయులలో కూడా కోర్కె లేని వారుండరు; దాన్ని చేతనైన రీతిలో తీర్చుకోక తప్పదు. మరొకరికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా తీర్చుకోవడం గొప్పే. ఆకలీ దప్పులూ తీర్చుకోకపోతే జీవితాలమీద తెరపడుతుంది. పైన చెప్పినపని చెయ్యకపోతే మనిషి మరణిస్తాడని నేను భావించడం లేదు.

కొన్ని కోర్కెలు బతకడానికి అవసరమైనవి. జిహ్వా చాపల్యంతో తినే తిండికి, చావును నిరోధించడానికి తినవలసిన మౌలికమైన తిండికి భేదం వుంది. కొన్ని కోర్కెలను కొని తెచ్చుకుని వాటిని తీర్చుకునే పనిలో పడతాం. రాబడులు సరిపోక నానా గడ్డి తినే ప్రయత్నానికి పూనుకోడం కద్దు. కామం నాటిన విత్తుకు మొలిచిన మొక్క ఈ శరీరం. దాని ప్రతి భాగం కోర్కె స్వరూపమే. అమ్మా నాన్నల కోర్కె వదిలిన చేదు గుర్తులం మనం. మన కోర్కె ఫలితంగా మన సంతానం పుట్టుకొస్తుంది. అది నిరంతరాయంగా కొనసాగే సృష్టి ప్రక్రియ. అందుచేత, "కోర్కె, పోవే!" అని గద్దిస్తేనో, తోలేస్తేనో పోదు. తోలేస్తే పోవడానికి అది కాకి కాదు. కాకిరెట్టను చూసినప్పటి జుగుప్స భోగాల పట్ల కలిగి యుండుము అని అన్నపుడు వినడానికి సొంపుగా ఉంటుంది. కోర్కెలను మనం చంపలేము గాని అవి మనలను వేపుకుతిని చంపుతాయి. అంచేత ఒక చెంప మనకున్న కోర్కెలతో పోరు సలుపుతూ మరో చెంప దారిన పోతున్నవాటిని ఆహ్వానించి అర్ఘ్యపాద్యాలు ఇచ్చి మన పీక మనమే పిసుక్కో కూడదు. విచ్చలవిడి కోర్కెలు వ్యక్తిగత మరియు సామాజిక అశాంతికి, అసంతృప్తికి దారితీస్తాయి.

ఈ సందర్భంలో Pleasure is the alpha and omega అంటూనే ఎపిక్యూరస్ అనే తత్త్వవేత్త చెప్పిన విషయం ఉటంకిస్తున్నాను. "నీకు అందుబాటులోలేని ఆనందాన్ని గురించీ ఆలోచిస్తూ నీకు లభ్యమై ఉన్న ఆనందాన్ని పాడు చేసుకోవద్దు. ఎవడికైతే చాలినంత ఉందొ వాడు దాన్ని స్వల్పంగా భావిస్తే వాడికి ఎంత సిద్ధించినా అది వాడికి చాలదు." అంటే సంతృప్తిలేని వాడి జీవితానికి సౌఖ్యం పూజ్యం అని. నీకు కలిగే ప్రతి కోర్కెనూ ఇలా ప్రశ్నించుకో అన్నాడు: ఈ కోర్కె సిద్ధిస్తే నాకు ఏమి జరుగుతుంది, సిద్ధించకపోతే నాకు ఏ నష్టం వాటిల్లుతుంది?

కోర్కెల కుంపటి అయినంత మాత్రాన శరీరాన్ని చులకన చెయ్యకూడదు. శరీరం (తలతో పాటు) లేకపోతె ఏ తత్త్వాన్నైనా దేనికి బోధిస్తాం? మానుకా, శూన్యానికా? లౌకిక దృష్టితో చూసినపుడు అనేక సుఖాలను అది ప్రసాదించడమే కాక సిరులూ, స్థలాలు చేకూర్చగలదు, వాటిని శరీరం అనుభవించవచ్చు, కొంతకాలం తరువాత పాడెక్కవచ్చు. ఒక మూత్రపిండం అమ్ముకుంటే లక్షలు చేస్తుంది. రెండూ అమ్ముకునే వీలు లేదు. ఆ విషయంలో కొంత అసంతృప్తి తప్పదు. కన్ను, గుండెకాయ, కాలేయం (మరణానంతరం) మరొకరికి ఉపయోగపడతాయి. కావాలంటే ఏది ధర పలకదు? ఈ వాణిజ్య, వ్యాపార సంస్కృతిలో చీడకూడా విలువైనదే – ఇది తగిలించుకోడానికి కాకపోయినా, ఒదిలించుకోడానికి. కాబట్టి చీడను కూడా చిన్నచూపు చూడకూడదు. మన శత్రువులకు చీడనంటించి మనం ఆనందాన్ని పొందే వీలుంది.

సమాజం, అది ఏర్పరుచుకున్న నైతిక వ్యవస్థ, చట్టం, సంఘంలో ఏర్పరుచుకున్న వ్యక్తిగత గౌరవం, అంతరాత్మ, అసమర్థత, అవతలివాడి ప్రతిఘటన, ఆర్థిక స్థాయి మనిషి అనైతిక స్వేచ్ఛా జీవనానికి సంకెళ్లు వేస్తాయి. లేచిందే లేడికి పరుగు అన్నట్టు కోర్కె కలగగానే దాన్ని తీర్చుకునే అవకాశం అరుదు. అది ఒక విధంగా మనిషికి వరమేనంటాను. మనిషి సాధారణ జీవితానికి సంబంధించిన అవసరాలు కొన్ని ఉన్నాయి, తత్సంబంధమైన కోర్కెలున్నాయి. అవే చాలామందికి సమకూరే పరిస్థితులు లేవు.

ఋగ్వేదంలోని నాసదీయ సూక్తం సృష్టికి ఆది కోర్కె అంటుంది. "ఆదిలో కోర్కె అవతరించింది. అది ప్రాథమిక విత్తనం. మనసులో పుట్టినది." అంటుంది ఆ సూక్తం. అంటే కోర్కెకన్నా మనసు ముందు పుట్టుండాలి. కోర్కెలలాగే కోర్కెల మీది ప్రసంగం ఆరంభిస్తే దానికి అంతుండదు.

కోర్కె లేకపోతె నాగరికత ఉండేదే కాదు. కోర్కెల సంఖ్య పెరగటం నాగరికత వృద్ధికి దారి తీసింది. నాగరికత ఎందుకు? అని ఎవ్వరూ ప్రశ్నించరు. కందమూలాలు తింటూ, మొలచుట్టూ ఆకులూ అలములూ కట్టుకుని లేక కట్టుకోకుండా తిరుగుతూ గడుపుదాము అని మీరెవరు అనరు. నేనూ ఆ పనికి సిద్ధంగాలేను. తిండి, బట్ట, సుఖం ఎంతో కొంత ఉంటూ, ఇంకా అవి అధికంకావాలని మరెన్నో కావాలని తపన మనలను తొలుస్తుంటేగాని మనం ఒకచోట చేరి, ప్రార్థనలు, భజనలు చేసుకుంటూనే, ఉపన్యాసాలు వింటూనే గడపటానికి వీలు చిక్కదు; మాలాంటి వాళ్ళు నిరుద్యోగంతో గోళ్లు కొరుక్కుంటూ రహదార్ల కూడళ్లలో గడపాలి. ప్రజాస్వామ్య దేశాలు ప్రజలకు చాలినన్ని ఉద్యోగాలు సృష్టించడం అసాధ్యం; అది గ్రహించడం వలెనే వాటి వాటి రాజ్యాంగాలలో ఎవరు ఏ వృత్తి కావలిస్తే అది చేపట్టే, బ్రతికే స్వేచ్ఛలకు అధికరణాలు ఏర్పరిచారు. చోరవృత్తులు, దోపిడీ లాంటి ఉపాధి ఎవరికి వారు ఏర్పరచుకోవచ్చుగాని – వీటికి మాత్రం ఒక నియమం ఉంది – దొరికిపోకూడదు. అయితే ఎవరూ కావాలని దొరికిపోరు.

మీరు చెబుతున్నది మాకు గ్రీకు, లాటిన్ భాషలలా వుంది. ఒక సామాన్యుడు సామాన్య జీవితాన్ని జీవిస్తుంటే ఏ పంథా అవలంభించాలి? అని అడిగితె నేను ఇలా చెప్పదలచుకున్నా.

సత్యాన్ని కనుగొనాలన్న వృథా ప్రయాసకు పూనుకోకుండా, జీవిత సుఖానుభవాన్ని దూరంచేసుకోడంకన్నా జీవితాన్ని ఎలా సుఖప్రదం చేసుకోవాలన్న ఆలోచనలలో మీ మనసు నిమగ్నమయితే మంచిదా అన్న ఆలోచన నన్ను వేధిస్తోంది. ఎవరికి ఏది మంచిదనిపిస్తే అలా మరొకరితో సంఘర్షణకు దిగకుండా జీవించండి. ఒకరి సుఖానికి మరొకరు అడ్డురాకుండా, సుఖం వెర్రితలలెయ్యకుండా, పరిమితితో సుఖానుభూతులను పొందండి. అలా అని సత్యాన్వేషణను మానెయ్యమని నేననడం లేదు. అదీ చెయ్యండి – కానీ కాలక్షేపానికి.

ఆ ఉపన్యాసానంతరం ఆమె అతని ఏకాంత దర్శనానికి దొంగతనంగా భద్రతా సిబ్బంది కన్నుకప్పి వైకుంఠ ద్వారంలాంటి స్వామి గుమ్మాన్ని చేరింది. సదాజపుడు వరండాలోని సోఫాలో కూర్చుని ఏదో పనిలో నిమగ్నుడయి ఉన్నాడు. "చిన్న స్వామీజీ" అని చాలామధురంగా పిలిచింది. అతని కళ్ళజోడు జారింది ఉలికిపాటుకు, హృదయంలో దొంగతనంగా ఎవరో తంత్రులు మీటినట్టయింది. బ్రహ్మచర్యం ఒక భయంకరమైన శిక్ష. కళ్ళు జిగేలుమంటుండగా, దీనమైన ముఖంతో నిలబడ్డ ఆ అగంతకురాలు కనబడింది.

"స్వామి దర్శనం ఇక మీకు దొరకదు. ఆ విషయం మరిచిపోండి. సమావేశ మందిరంలో అందరికీ స్వామి దర్శనమిస్తుండగా ఏకాంత దర్శనంలో మీరు ఏమి పొవుకుంటారు?" ఆమె నోరు తెరిచి అడగకుండానే కోపం పైకి కనబడకుండా అన్నాడు సదాజపుడు.

"నలుగురిలో తీర్చుకోలేని సందేహాలుంటాయి. స్వామిని నా ప్రాణసమానంగా ఆరాధిస్తున్నాను. మీరు నేనొచ్చానని చెప్పండి, చాలు. ఆయన అనుమతిస్తే దర్శనం చేసుకుంటా; లేకపోతె ఇంకెన్నడూ రాను."

తిడితే తిట్టాడని మనసులో అనుకుని, లోపలి వెళ్లి ఆమె మాటలను ఉన్నవి ఉన్నట్టుగా నివేదించాడు శిష్యుడు. స్వామి చాలా తీవ్రంగా అతని ముఖంలోకి చూశాడు. చేతికి దగ్గిరగా ఉన్నదాన్ని తన మీదికి విసురుతాడేమో అన్న భయంతో సదాశివుడిని తలచుకున్నాడు.

"ఆమెకు ఇది అలవాటుగా మారింది! పంపు. రెండు నిమిషాలు మించి ఉండటానికి వీలులేదు అని ఆ సాధ్వికి చెప్పు."

ఆమె పవిటకొంగు ఒళ్ళంతా వీలైనంత వరకూ కప్పుకుని, నుని సిగ్గుతో లోపలి వచ్చింది ఆడ గుర్రంలా. ఆమె వైపు ఆయన చూడలేదు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS